


రష్మిక మందన్న

## కెరీర్‌లో తొలిసారి..

కన్నడ కస్తూరి రష్మిక మందన్న చేతిలో ప్రస్తుతం ఆరు భారీ చిత్రాలున్నాయి. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో ఈ అమ్మడు దూసుకుపోతున్నది. కెరీర్‌లో ఇప్పటివరకు ఎక్కువగా వాణిజ్య చిత్రాల్లో భాగమైన ఈ భామ తొలిసారి ఓ మహిళా ప్రధాన చిత్రంలో నటించబోతున్నట్లు తెలిసింది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. గీతా ఆర్ట్స్, జీఏ2 సంస్థలు నిర్మించనున్నాయని తెలిసింది. చిలసౌ, మన్మథుడు-2 తర్వాత రాహుల్ రవీంద్రన్ ఈ సినిమాతో మరలా మెగాఫోన్ పట్టబోతున్నారు. ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన కథా చర్చలు పూర్తయ్యాయని, కథలోని కొత్తదనం నచ్చడంతో రష్మిక మందన్న వెంటనే ఈ సినిమాకు ఓకే చెప్పిందని అంటున్నారు. ఓ వైపు భారీ కమర్షియల్ సినిమాల్లో బిజీగా ఉంటూనే, మరోవైపు కెరీర్‌పరంగా ప్రయోగాలకు సిద్ధమవుతున్నది రష్మిక మందన్న. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుందని తెలిసింది. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో పుష్ప-2, రెయిన్‌బో చిత్రాలతో పాటు విజయ్ దేవరకొండ సరసన ఓ సినిమాలో నటిస్తున్నది.



## డిసెంబర్‌లో త్రివిక్రమ్ సినిమా షురూ

సినీరంగంలో కొన్ని కాంబినేషన్స్‌కు తిరుగుండదు. అలాంటి వాటిలో త్రివిక్రమ్-అల్లు అర్జున్ కాంబో ఒకటి. జులాయి, సన్ ఆఫ్ సత్యమూర్తి, అల వైకుంఠపురములో వంటి సినిమాలతో హ్యాట్రిక్ హిట్ సాధించారు. వారిద్దరి కలయికలో నాలుగో చిత్రం రాబోతున్న విషయం తెలిసిందే. అల్లు అర్జున్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో కొత్త చిత్రాన్ని కొద్ది రోజుల క్రితం అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమా ఎప్పుడు సెట్స్‌మీదకు వెళ్తుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం డిసెంబర్‌లో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు తెలిసింది. పాన్ ఇండియా స్థాయి కథాంశంతో దర్శకుడు త్రివిక్రమ్ ఈ సినిమా స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారని, భారీ హంగులతో తీర్చిదిద్దబోతున్నారని చెబుతున్నారు. హారిక అండ్ హాసిని, గీతా ఆర్ట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాయి. ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప-2' చిత్రీకరణలో ఉన్నారు. ఆగస్ట్ 15న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.



## విద్యార్థులే జాతి సంపద

సినిమా అనేది వ్యాపారం. ఎవరైనా తీసేది డబ్బుకోసమే. కానీ నమ్మిన సిద్ధాంతం కోసం, అనుసరించే భావాజాలం కోసం, తాడితపీడిత ప్రజానీకం గొంతుగా సినిమా తీసేవాళ్లు దేశంలో ఒక్కరే ఉన్నారు. ఆయనే ఆర్.నారాయణమూర్తి. ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'యూనివర్సిటీ'. ఈ నెల 13న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణమూర్తి మాట్లాడుతూ- '' నేటి విద్యావ్యవస్థని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లంబకోణాలు నేర్పిన వాళ్లే కుంభకోణాలు చేస్తూవుంటే విద్యార్థులంతా రెక్కలు తెగిన పావురాల్లా విలవిల లాడుతున్నారు. ఊపిరాడక నేల కొరుగుతున్నారు. ఇలా అయితే వారిపై ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు ఏమైపోవాలి? పాఠాలు నేర్పిన గురువులు ఏమైపోవాలి?' అంటూ ప్రశ్నించారు. 'సంవత్సరానికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీగారూ.. దయచేసి ఇవ్వండి. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరణ చేసుకుంటూపోతే యువతకు ఉద్యోగాలెలా వస్తాయి? యువతరం జాతి సంపద. వారిని రక్షించుకునే బాధ్యత మనపై ఉంది. నా 'యూనివర్సిటీ' సినిమా కథాంశం ఇదే' అన్నారు నారాయణమూర్తి. ఇంకా కెమెరామెన్ బాబూరావు దాస్, ఎడిటర్ మాలిక్, కవిగాయకుడు విజయ్ కూడా పాల్గొన్నారు. స్వర్గీయ గద్దర్, జలదంకి సుధాకర్, వేల్పుల నారాయణ, మోటపలుకుల రమేష్, ములుగు విజయ్ ఈ సినిమాకు పాటలు రాశారు.



నేహాశెట్టి

## ప్రపంచాన్ని చుట్టిరావాలని కోరిక..

డీజే టిల్లు, బెదురులంక 2012 సినిమాలతో వెంటవెంటనే హిట్స్‌వచ్చాయి. ఈ 'రూల్స్ రంజన్' కూడా హిట్ అయితే హ్యాట్రిక్ అవుతుంది. అందుకే కాస్త భయంగా ఉంది. ' అని నేహాశెట్టి చెప్పింది. కిరణ్ అబ్బవరం సరసన ఈ ముద్దుగుమ్మ నటించిన చి త్రం 'రూల్స్ రంజన్'. రత్నం కృష్ణ దర్శకుడు. దివ్యాంగ్ లవానియా, మురళికృష్ణ వేమూరి నిర్మాతలు. ఏఎం రత్నం సమర్పిస్తున్న ఈచిత్రం ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా నేహా విలేకరులతో ముచ్చటించింది. 'డీజే టిల్లు' లోలా ఇందులోనాది సెల్ఫిష్ పాత్ర కాదు. ఈ సినిమాలో నా పాత్ర పేరు సన. ఊరు తిరుపతి. అందంగా ఉంటాను. ఎప్పుడూ నవ్వుతూ ఆనందంగా ఉంటాను. బబ్లీగా ఉంటాను. చూడ్డానికి పక్కింటమ్మాయిలా ఉంటాను. ధైర్యసాహసాలు కూడా ఎక్కువే. ఈ సినిమాలో నా పాత్రకు ప్రపంచాన్ని చుట్టిరావాలనే కోరిక ఉంటుంది. సినిమా విడుదలయ్యాక కచ్చితంగా సన అందరికీ నచ్చుతుంది.'' అని చెప్పింది నేహా.


## యూనివర్సల్ కాన్సెప్ట్‌తో 'మంత్ ఆఫ్ మధు'



సిద్ధు జొన్నలగడ్డ, నవీన్‌చంద్ర, స్వాతిరెడ్డి, యశ్వంత్

'దర్శకుడుశ్రీకాంత్ నాగోతితో 'భానుమతి రామకృష్ణ' చేశాను. చాలామంచి పేరొచ్చింది. ఇంకా మంచిపేరు రావాల్సిన సినిమా అది. రానున్న 'మంత్ ఆఫ్ మధు' కూడా యూనివర్సల్‌గా ఉంటుంది. ఈ మధ్యకాలంలో చూసిన బెస్ట్ ట్రైలర్ 'మంత్ ఆఫ్ మధు'. అన్ని సినిమాలు వేరు, ఈ సినిమా వేరు అని ట్రైలర్ చెప్పింది. సినిమా వేరే లెవల్‌లో ఉంటుందని అనుకుంటున్నా' అని సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. నవీన్‌చంద్ర, స్వాతి ప్రధానపాత్రధారులుగా రూపొందిన చిత్రం 'మంత్ ఆఫ్ మధు'. ఈ నెల 6న విడుదల కానున్న ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఎం.ఎం.కీరవాణి, సిద్ధు జొన్నలగడ్డ అతిథులుగా హాజరయ్యారు. కీరవాణి మాట్లాడుతూ 'ట్రైలర్ చూసినప్పుడు ఫీల్‌గుడ్ మూవీ అనిపించింది. దర్శకుడి ప్రతిభ ట్రైలర్‌లోనే కనిపిస్తుంది. సంగీత దర్శకుడు అచ్చు పనితనం కూడా బావుంది. సినిమా మంచి హిట్ అవ్వాలి' అని ఆకాంక్షించారు. ఈ సినిమాలో ప్రతి పాత్రకూ ఒక గౌరవం ఉంటుందని, ప్రేక్షకుడు ప్రతి పాత్రనీ గుర్తుపెట్టుకుంటాడని నటి స్వాతి చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్ కూడా మాట్లాడారు.

## కెనడా వలసదారుల కథేనా?



ఖలిస్థాన్ వేర్పాటువాద మద్దతుదారుడు హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్య కేసు విషయంలో భారత్-కెనడా దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు తలెత్తిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాలీవుడ్ అగ్ర హీరో షారుఖ్‌ఖాన్ తాజా చిత్రం 'డంకీ' కథ గురించి సోషల్‌మీడియాలో ఆసక్తికరమైన చర్చ నడుస్తున్నది. భారత్ నుంచి కెనడాకు వెళ్లే అక్రమ వలసదారుల ఇతివృత్తంతో దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని వార్తలొస్తున్నాయి. తాజాగా వీటిపై చిత్ర సన్నిహిత వర్గాలు స్పందించాయి. భారత్-కెనడా దేశాలతో ఈ కథకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశాయి. 'డంకీ ఫ్లైట్' బ్యాక్‌గ్రౌండ్‌లో జరిగే కథ ఇది. భారత్ నుంచి ఇతర దేశాలకు అక్రమంగా వెళ్లేవారు డంకీ ఫ్లైట్ అనే మార్గాన్ని అనుసరిస్తారు. అలా ఉన్నత జీవితాన్ని కాంక్షిస్తూ విదేశాలకు వెళ్లే వలసదారుల కష్టనష్టాల గురించి ఈ సినిమాలో చర్చించాం. కెనడాలో స్థిరపడిన ప్రవాస భారతీయుల గురించి ఎలాంటి ప్రస్తావన ఉండదు. గొప్ప జీవితం కోసం తపించే కథానాయకుడి అంతరంగాన్ని ఆవిష్కరిస్తూ కథ సాగుతుంది. ఎలాంటి వివాదాస్పద అంశాల జోలికి పోకుండా ఈ సినిమాను తెరకెక్కించాం' అని చిత్రబృందం వివరణ ఇచ్చింది. తాప్సీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 22న భారీ స్థాయిలో విడుదలకానుంది.

## మురళీధరన్ జీవితం స్ఫూర్తిదాయకం



శివలెంక కృష్ణప్రసాద్

'క్రికెట్ దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ జీవితం నిజంగా స్ఫూర్తిదాయకం. ఇది డాక్యుమెంటరీ కాదు. పూర్తి స్థాయి కమర్షియల్ సినిమా. అసలు మురళీధరన్ జీవితంలో కమర్షియల్ అంశాలకు కొదవలేదు. ఆయన జీవితంలో ఇన్ని మలుపులున్నాయా? ఇన్ని కుదుపులున్నాయా? అని మీరే ఆశ్చర్యపోతారు' అన్నారు శివలెంక కృష్ణప్రసాద్. లెజెండరీ క్రీడాకారుడు, శ్రీలంకన్ ఆఫ్ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ జీవితం ఆధారంగా తెరకెక్కించిన బయోపిక్ '800'. ఎం.ఎస్ శ్రీపతి దర్శకుడు. ముత్తయ్యగా 'స్లమ్‌గాడ్ మిలియనీర్' ఫేం మధుర్ మిట్టల్, ఆయన భార్య మదిమలార్‌గా మహిమా నంబియార్ నటించారు. ప్రముఖ నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ సమర్పిస్తున్న ఈ చిత్రం ఈనెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత శివలెంక విలేకరులతో ముచ్చటించారు. 'శ్రీపతిని నేను దర్శకుడ్ని చేయాలనుకునేలోపు తనకు ఈ అవకాశం వచ్చింది. మంచి అవకాశం అవ్వడంతో ఒప్పుకున్నాను. చాలా బాగాతీశాడు. సినిమా పూర్తయ్యాక నాకు ఫోన్ చేసి 'సినిమాను మీరే టేకోవర్ చేస్తే బావుంటుంది' అని అడిగాడు. ఈ సినిమా నిర్మాతను నేను కాపోయినా శ్రీపతి వల్ల ఈ సినిమా గురించి తెలుసుకుంటూనే వున్నాను. చివరకు మురళీధరన్ కూడా ఫోన్ చేసి చెప్పడంతో కాదనలేకపోయాను' అని చెప్పారు శివలెంక. ఇంకా చెబుతూ 'మొదట ఈ పాత్రకు విజయ్‌సేతుపతి అనుకున్నాం. కుదర్లేదు. తర్వాత నాని అనుకున్నాం కుదర్లేదు. చివరకు మధుర్ మిట్టల్ హీరో అయ్యాడు. ఈ సినిమా వల్ల సచిన్, సౌరవ్ గంగూలీ, వీవీఎస్ లక్ష్మణ్, అనిల్ కుంబ్లే లాంటి క్రికెట్ దిగ్గజాలను కలిసినందుకు ఆనందంగా ఉంది. ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుంది' అని శివలెంక కృష్ణప్రసాద్ నమ్మకం వ్యక్తంచేశారు.

## అక్షయ్‌కుమార్ 'స్కై ఫోర్స్'



బాలీవుడ్ అగ్ర హీరో అక్షయ్‌కుమార్ వరుసగా సినిమాలను పట్టాలెక్కిస్తున్నారు. సోమవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని తాను నటిస్తున్న తాజా చిత్రం 'స్కై ఫోర్స్' ఫస్ట్‌లుక్‌ను సోషల్‌మీడియా ద్వారా పంచుకున్నారు. 1965 ఇండో-పాక్ యుద్ధ నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భారతదేశపు తొలి వైమానిక దాడి నేపథ్యంలో ఈ సినిమా ఆద్యంతం దేశభక్తి ప్రధానంగా నడుస్తుందని అక్షయ్ కుమార్ తెలిపారు. 'చాలా మందికి తెలియని కథ ఇది. భారతదేశపు తొలి వైమానిక దాడి సందర్భంగా జరిగిన పరిణామాలను కళ్లకు కడుతుంది. దేశభక్తి ప్రబోధించే చిత్రమిది. జై హింద్' అంటూ అక్షయ్‌కుమార్ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పేర్కొన్నారు. ఈ చిత్రానికి సందీప్ కెల్వాని, అభిషేక్ కపూర్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది అక్టోబర్ 2న విడుదలకానుంది.

## ఊహకందని సాహసాలు చూస్తారు



'మేము స్టూవర్ట్‌పురం ప్రాంతంలోనే పుట్టిపెరిగాం. చిన్నప్పట్నుంచీ 'టైగర్ నాగేశ్వరరావు' గురించి కథలుకథలుగా విన్నాం. ఆ విధంగా ఈ కథతో మాకు కాస్త దగ్గర సంబంధం ఉంది. నాగేశ్వరరావు అంటేనే సాహసం. ఆయన చేసినవన్నీ ఊహకందని సాహసాలే. అవన్నీ ఈ సినిమాకు పనిచేస్తున్నప్పుడు ఉపయోగపడ్డాయి. నిజంగా ఆ పాత్రకు రవితేజ సరిగ్గా సరిపోయారు' అన్నారు ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్. రవితేజ కథానాయకుడిగా వంశీ దర్శకత్వంలో అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా రామ్‌లక్ష్మణ్ మీడియాతో ముచ్చటించారు.

### ఆయన రియల్ హీరో

'టైగర్ నాగేశ్వరరావు' ఓ రాబిన్‌హుడ్. ఉన్నోళ్లను కొట్టి లేనోళ్లకి పెట్టడం ఆయన స్టైల్. ఆయనకు స్వయంగా పోలీసులే 'టైగర్' అనే బిరుదు ఇచ్చారు. తాడిచెట్టంత ఎత్తులో ఉండే చెన్నయ్ జైలు గోడ ఈజీగా దూకి పారిపోయాడంట నాగేశ్వర్రావ్. మేం పోరాటలు చిత్రీకరించేటప్పుడు రోప్ వాడతాం. బోలెడు ఏర్పాట్లు చేస్తాం. అలాంటిది ఏ సాయం లేకుండా అంతఎత్తు గోడ ఎక్కగలిగాడంటే, అంతకంటే ఆశ్చర్యం ఉంటుందా? నిజంగా ఈ సినిమా మేం చెయ్యడం ఫైట్ మాస్టర్లుగా మాకు సాహసమే. అందుకే ఇందులో ఫైట్లన్నీ రియలిస్టిక్‌గా కంపోజ్ చేశాం. ఇందులోని ప్రతి ఫైట్‌ను ప్రేక్షకులు రియల్‌గా ఫీలవుతారు.

## అడుగుపెడితే రణరంగమే



'ఘోస్ట్' చిత్రంలో శివరాజ్‌కుమార్

కన్నడ అగ్ర హీరో శివరాజ్‌కుమార్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'ఘోస్ట్'. శ్రీని దర్శకుడు. సందేశ్ ప్రొడక్షన్స్ పతాకంపై సందేశ్ నాగరాజ్ నిర్మిస్తున్నారు. అక్టోబర్ 19న తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్ర తెలుగు ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు రాజమౌళి సోషల్‌మీడియాలో విడుదల చేశారు. హై ఓల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్స్‌తో ట్రైలర్ ఆకట్టుకుంది. 'నేను ఎవరి జోలికి వెళ్లను. ఓడిపోతాననే భయం కాదు. నేను వెళితే రణరంగం మారణహోమంగా మారుతుంది' అంటూ శివరాజ్‌కుమార్ చెప్పిన సంభాషణలు రొమాంచితంగా సాగాయి. హాలీవుడ్ స్థాయి యాక్షన్ హంగులతో ప్రేక్షకులకు ఓ సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే చిత్రమిదని దర్శకుడు తెలిపారు. అనుపమ్‌ఖేర్, జయరామ్, ప్రశాంత్ నారాయణన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మహేంద్ర సింహ, సంగీతం: అర్జున్‌జన్య, కథ, దర్శకత్వం: శ్రీని.



ప్రాచీ తెహ్లాన్

## 'జెంటిల్‌మేన్-2'లో నాయికగా..

ఒకప్పటి బ్లాక్‌బస్టర్ చిత్రమైన 'జెంటిల్‌మేన్'కు సీక్వెల్‌గా తెరకెక్కుతున్న సినిమా 'జెంటిల్‌మేన్-2'. కేటీ కుంజుమన్ నిర్మాత. గోకుల్‌కృష్ణ దర్శకుడు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్నది. ఈ చిత్రంలో ప్రాచీ తెహ్లాన్ కథానాయికగా నటిస్తున్నది. అర్జున్, మామంగం, త్రిశంకు చిత్రాల్లో నటించిందీ భామ. ఆమె మాట్లాడుతూ 'ఓ బ్లాక్‌బస్టర్ మూవీ ఫ్రాంఛైజీలో భాగమైనందుకు ఆనందంగా ఉంది. ఈ సినిమాలో యాక్షన్ సీక్వెన్స్‌లో నటించబోతున్నా. ఇదొక సవాలుగా స్వీకరించా. యాక్షన్ ఎపిసోడ్ కోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నా. త్వరలో షూటింగ్‌లో జాయిన్ కాబోతున్నా' అని చెప్పింది.